# మానవ వనరుల్లో మంచి అవకాశాలు

- 4.67 కోట్ల చిన్న కంపెనీలున్నాయ్
- హ్యూసిస్ అధిపతి జి.ఆర్.రెడ్డి
- మార్కెట్‌లో నమోదైన తొలి హెచ్ఆర్ కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు మానవ వనరుల (హెచ్ఆర్) నిర్వహణ, సేవలను అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన హెచ్ఆర్ ఫంక్షన్ మేనేజిమెంట్ కంపెనీ హ్యూసిస్ ఎన్ఎస్ఈ ఎమర్జ్ (సంస్థాగత ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్)లో నమోదైంది. దేశంలోనే స్టాక్ మార్కెట్‌లో నమోదైన తొలి హెచ్ఆర్ కంపెనీ ఇదే అవుతుంది. చిన్న సంస్థల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌లో నమోదైన తర్వాత సంస్థాగత మదుపర్లు షేర్లను కొనుగోలు చేస్తారు. ఇందులో కనీసం రూ. 10 లక్షలతో షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మార్కెట్ నుంచి రూ.3 కోట్లు సమీకరించనున్నామని.. క్లౌడ్ టెక్నాలజీ ఆధారంగా హెచ్ఆర్ సేవలను అందించడానికి, రిక్రూటర్లు, హెచ్ఆర్ శిక్షణ సంస్థల భాగస్వామ్య నెట్‌వర్క్‌ను పెంచుకోవడానికి ఈ నిధులను వినియోగిస్తామని హ్యూసిస్ వ్యవస్థాపకుడు జి.ఆర్.రెడ్డి తెలిపారు.




ఒక చిన్న కంపెనీలో మానవ వనరుల విభాగం అధిపతికి ఏడాదికి కనీసం రూ.కోటి వేతనం చెల్లించాల్సి ఉంటుందని, చిన్న, మధ్య స్థాయి కంపెనీలు దీన్ని భరించలేవని వివరించారు. అటువంటి కంపెనీలకు నియామకాలు, నిర్వహణ నుంచి అన్ని రకాల మానవ వనరుల సేవలు, సలహాలు, టెక్నాలజీలను కంపెనీ అందిస్తోంది. ఇప్పటి వరకూ 400 కంపెనీలకు సేవలు అందించింది. తాజా గణాంకాల ప్రకారం దేశంలో 4.67 కోట్ల చిన్న, మధ్య స్థాయి కంపెనీలు ఉన్నాయి. వీటిలో అధిక శాతం కంపెనీలకు మానవ వనరుల విభాగాలే లేవు. మానవ వనరుల సేవలను అందించడానికి దేశీయంగా మంచి అవకాశాలు ఉన్నాయి. నియామక, శిక్షణ సంస్థలను భాగస్వాములుగా చేసుకుని సేవలను విస్తరించనున్నామని రెడ్డి వివరించారు. భవిష్యత్తులో మానవ వనరుల సేవలకు సంబంధించిన అనేక రకాల యాప్‌లు, టెక్నాలజీలను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. మానవ వనరులకు సొంత విభాగాలను ఏర్పాటు చేసుకోవడానికి బదులు తమ సేవలను వినియోగించుకుంటే సేవల సమయంతోపాటు వ్యయం కూడా తగ్గుతుందన్నారు. ప్రస్తుతం హ్యూసిస్ 70 కంపెనీలకు మానవ వనరుల సేవలను అందిస్తోంది. వీటిలో 15,000 మంది ఉద్యోగులు ఉన్నారు. భాగస్వాములతోపాటు టెక్నాలజీ ఆధారంగా సేవలను మరింత విస్తరించి త్వరలోనే 5 లక్షల మంది ఉద్యోగులను నిర్వహించాలని భావిస్తున్నట్లు రెడ్డి తెలిపారు. 2016 చివరి నాటికి 40 పట్టణాలకు సేవలను విస్తరించాలని కంపెనీ నిర్ణయించింది. విశాఖపట్నం, విజయవాడల్లో వచ్చే ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు చెప్పారు.